సాక్షి
ప్రకాశం
బుధవారం । 4 । జూన్ । 2025



బడుగులపైనా పోలీసుల దౌర్జన్యం

కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులను హరిస్తోందని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు.

- 8లో..



పిండవుతున్న మురుగమ్మి కొండ

పీసీపల్లి మండలం మురుగమ్మి కొండపై తెల్లరాయి అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం కొండను తవ్వి తరలిస్తున్నారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
40 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఒకటి రెండు చోట్ల జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

బాబు వెన్నుపోటుపై నిరసన గళమెత్తండి



ఒంగోలు సిటీ: ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చి అధికారం లోకి వచ్చి ఏడాది దాటినా అమలు చేయ కుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా బుధవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాల్లో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు పాల్గొనాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. చంద్రబాబు వెన్నుపోటుపై ప్రజలు నిరసన గళమెత్తాలన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. రైతులు, మహిళలు, యువకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులు పాల్గొని ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై నిరసన తెలపాలన్నారు.

షూటింగ్‌లో జిల్లా స్థాయి ఎంపికలు రేపు

ఒంగోలు: ఎయిర్ రైఫిల్, పిస్టల్ షూటింగ్ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ఈనెల 5న స్థానిక నెక్స్‌జెన్ స్కూలులో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా రైఫిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కమ్మ ఖాదర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ రైఫిల్, పీప్ సైట్, ఓపెన్ సైట్, పిస్టల్ విభాగాల్లో అండర్ 16, 19, 21, 21 నుంచి 45 సీనియర్ కేటగిరీలకు సంబంధించి ప్రతిభను పరీక్షిస్తారన్నారు. బాలబాలికలకు విడివిడిగా పరీక్ష నిర్వహిస్తారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వారు మాత్రమే ఈ ఎంపికకు అర్హులు. ఈ పోటీల్లో మంచి పాయింట్లు సాధించిన వారు ఈనెల 21 నుంచి హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9505561357 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బాస్కెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టులో సెక్రటరీ సుబ్బారావు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్–23 బాలుర బాస్కెట్ బాల్ జట్టును కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం ఎంపిక చేశారు. మొట్టమొదటి అండర్–23 త్రీ అండ్‌త్రీ రాష్ట్ర చాంపియన్‌షిప్ చిత్తూరులో ఈ నెల 4, 5వ తేదీల్లో జరుగుతుంది. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి రవీంద్ర, సెక్రటరీ తొట్టెంపూడి సుబ్బారావు అభినందించారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మార్కాపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డిస్మిస్

మార్కాపురం: మార్కాపురం అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా (ఎఫ్ఆర్ఓ)గా పనిచేస్తున్న వరప్రసాద్ పై వచ్చిన లైంగిక వేధింపుల కేసులో తిరుపతి జిల్లా సూళ్లూరుపేట న్యాయస్థానం శిక్ష విధించిన నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు ఆయనను సర్వీస్ నుంచి డిస్మిస్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరప్రసాద్ గతంలో సూళ్లూరుపేటలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మహిళా ఉద్యోగిని పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న అభియోగాలపై ఈ ఏడాది ఏప్రిల్లో న్యాయస్థానం ఆయనకు శిక్ష విధించింది. ఈ నేపథ్యంలో వరప్రసాద్ పై నేరం రుజువై శిక్ష ఖరారు కావడంతో ఆయన్ను ప్రభుత్వ విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము పేరుతో మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.



వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్



అసంపూర్తిగా ఉన్న మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం

బాబు ఏలుబడిలో జిల్లా వాసులు అడుగడుగునా దగా పడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నమ్మి మరోసారి మోసపోయారు. జిల్లాకు జీవనాడులుగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టు, పశ్చిమ ప్రకాశం వాసుల ఆరోగ్యానికి కొండంత అండగా నిలిచే మెడికల్ కళాశాలను నిర్వీర్యం చేశారు. ఇక జిల్లాలో మిర్చి, శనగ, పత్తి, వరి, పొగాకు రైతులు గిట్టుబాటు ధర రాక రైతాంగం కుదేలవుతోంది. మద్దతు ధర కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేసినా కూటమి సర్కార్ కనికరించలేదు. మార్కాపురం జిల్లా అంటూ ఊరించి ఉసూరుమనిపించారు. ఒంగోలు జీజీహెచ్‌పై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. దొనకొండ ఇండస్ట్రియల్ పార్క్ అటకెక్కింది. ఇక సంక్షేమ పథకాలు సరేసరి. రేషన్ బియ్యం కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇలా ఏడాది కాలంగా జిల్లా వాసులు అన్ని రంగాల్లో అన్యాయానికి గురయ్యారు. ఇదేమని అడుగుతున్న వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఏడాది దగా పాలనపై ఫోకస్..

సాక్షి ఫోకస్

కక్షల పాలన..
హామీల హేళన





మిర్చిని కుప్పగా పోస్తున్న రైతు (ఫైల్)



పొగాకు బేళ్లు

జీవనాడులపై పోట్లు

- సాగు, తాగు నీటికి జీవనాడి వెలిగొండపై చిన్న చూపు
- పశ్చిమ ప్రకాశం వాసుల ఆయువుపట్టు మెడికల్ కళాశాలపై ప్రైవేటు పోటు
- మార్కాపురం జిల్లా అంటూ ఆశలు పెట్టి గాలిలో మేడలు
- మిర్చి, పత్తి, శనగ, వరి, పొగాకు రైతులు మద్దతు ధర రాక కుదేలు
- గాలిలో దొనకొండ ఇండస్ట్రియల్ పార్క్
- ఒంగోలు జీజీహెచ్‌పై నిర్లక్ష్యపు నీడలు
- ఇదేమని అడుగుతున్న వారిపై కేసులతో భయపెడుతున్న వైనం

రైతుల కష్టాలు తీర్చలేనివి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు స్వర్ణయుగంగా సాగింది. సకాలంలో వర్షాలు పడటంతో పాటు సాగర్ జలాలు ఐదేళ్ల పాటు సజావుగా తాగు, సాగుకు అందాయి. పుష్కలంగా పంటలు పండాయి. బహిరంగ మార్కెట్‌లోనే పంటలకు మంచి ధరలు వచ్చాయి. పొగాకులాంటి పంటకు గిట్టుబాటు ధర రాకపోతే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రైతుల వద్ద నుంచి మాడు పొగాకును కూడా అత్యధిక ధరకు కొనుగోలు చేయించారు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. ప్రస్తుతం జిల్లాలో రైతు పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. సకాలంలో వర్షాలు లేవు. ఒక వేళ వర్షాలు పడినా ఆరుగాలం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అలమటిస్తున్నారు. మిర్చి, పత్తి, శనగ, వరి, పొగాకు రైతులు మద్దతు ధర రాక కుదేలవుతున్నారు. వ్యయప్రయాసలకోర్చి పండించిన ఒక్క పంటను కూడా ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి ఆదుకున్న పాపాన పోలేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పొగాకుకు గిట్టుబాటు ధరల కోసం కొండపి-టంగుటూరు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

విద్యుత్ చార్జీలపై జనం గగ్గోలు..

పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఒంగోలు నగరం అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెంచారనీ, తాను అధికారంలోకి వచ్చిన తదుపరి విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత చార్జీలు పెంచుకుంటూ పోతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారు. బిల్లులు చూసి జనం గగ్గోలు పెడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

సూపర్ సిక్స్ పథకాలతో పాటు అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసానికి జిల్లా ప్రజలు నిలువునా దగాపడ్డారు. జిల్లాకు జీవనాడి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నుంచి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో సాగు, తాగు నీటిని అందిస్తానని ప్రగల్భాలు పలికాడు. జిల్లాతో పాటు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వైఎస్సార్ కడప జిల్లాలకు ఎంతో ప్రయోజనకారి అయిన వెలిగొండ ప్రాజెక్టుకు మొండి చేయి చూపి మొన్నటి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం రూ.116 కోట్లు కూడా కేటాయించి చిన్న చూపు చూశాడు. చివరకు 2026 జూలై నెలకు కానీ వెలిగొండ నుంచి నీరు ఇవ్వలేమని ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు చెప్పి చేతులు దులుపుకున్నారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు కింద పునరావాసం పూర్తికాలేదు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలకు పైసా కూడా విదిల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండల పరిధిలోని కొత్తూరు వద్ద జరుగుతున్న వెలిగొండ ప్రాజెక్టును చుట్టపు చూపుగా సందర్శించిన ముగ్గురు మంత్రుల బృందం పోలవరం కంటే ఎక్కువ ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టు వెలిగొండ అని, వచ్చే సీజన్ నుంచి నీళ్లు ఇస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. ముంపు గ్రామాలకు ఆర్వో ప్యాకేజీ, రెండో సొరంగంలో కొంత మేర పనులు మినహా వైఎస్ జగన్‌మోహనరెడ్డి హయాంలోనే మొత్తం ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ ఎలా నిర్లక్ష్యానికి గురైందో ఇప్పుడూ అంతేనని జిల్లా వాసులు నిట్టూరుస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒంగోలు జీజీహెచ్‌కు మహర్దశ పట్టింది. వందల కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. మెడికల్ కళాశాలకు పీజీ సీట్లు వచ్చేలా కృషి చేసింది. కరోనా సమయంలో జీజీహెచ్‌లో అందించిన సేవలు నేటికీ ప్రజలు గుర్తుకు చేసుకుంటూనే ఉన్నారు. ప్రస్తుతం కూటమి సర్కార్ హయాంలో నిర్లక్ష్యానికి గురైంది.

మెడికల్ కళాశాల, కొత్త జిల్లాలకు మంగళం..

గత ఏడాది ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు మార్కాపురం, పొదిలి పట్టణాల్లో జరిగిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అధికారంలోకి వస్తే వెంటనే వెలుగొండ పూర్తిచేస్తానని, మార్కాపురాన్ని జిల్లా చేస్తానని హామీలు ఇచ్చారు. ఈ రెంటినీ నెరవేర్చకపోగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులను బదిలీ చేశారు. ఈ ప్రాంతవాసులకు మెరుగైన వైద్యం అందకుండా చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యేవి. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయిన మెడికల్ కళాశాల భవనాలు నిరుపయోగంగా మారాయి. చంద్రబాబు నిర్ణయం ఫలితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలకు పొరుగు ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లా చేస్తానన్నారు. ఏడాది పూర్తవుతున్నా ఆ ఊసేలేకుండా వంచనకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మిర్చి క్లస్టర్ ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చింది. ఇంత వరకూ ఆ ప్రకటన మాటలకే పరిమితమైంది.

– ఎన్నికల సందర్భంగా గత సంవత్సరం జనవరి 5వ తేదీ కనిగిరిలో చంద్రబాబు 'రా కదలిరా.. కార్యక్రమం' ప్రారంభోత్సవ సభలో చంద్రబాబు నాయుడు పలు హామీలు ఇచ్చారు. కనిగిరి కేంద్రంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని, కనిగిరి ప్రజలకు సాగు, తాగు నీరు అందిస్తానని, ట్రిపుల్ ఐటీ కళాశాల నిర్మిస్తానన్నారు. కనిగిరికి సురక్షిత జలాలు.. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు మంజూరుకు హామీ ఇచ్చారు. ఏడాదైనా.. అవి అమలుకు నోచుకోలేదు. యువగళం పాదయాత్రలో నారాలోకేష్ పలు హామీలు ఇచ్చారు. వలసల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ఇంటింటికీ సాగర్ నల్లా నీరు అందిస్తామని, కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్ సెంటర్లు పెంచి, పూర్తి స్థాయిలో డాక్టర్లను నియమిస్తామని, బత్తాయి, పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటామని ఎన్నో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదు.

పచ్చమూకల దౌర్జన్యకాండకు అంతేలేదు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో పచ్చమూకలు రెచ్చిపోయాయి. ఒక వైపున ఓట్ల లెక్కింపు పూర్తికాకుండానే సచివాలయాల మీద దాడులు చేసి శిలాఫలకాలను ధ్వంసం చేశారు. సచివాలయాలు ప్రభుత్వ సంపద అనే ఇంగితం కూడా మరచి పచ్చమూకలు దాడులు చేస్తుంటే పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారు. ఎక్కడా అడ్డుకునే ప్రయత్నాలు చేయలేదు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తుంటే అధికారులు ఎక్కడా స్పందించలేదు. మాకు తెలియదు, ఎవరూ ఫిర్యాదు చేయలేదంటూ బుకాయించారు. ఎక్కడైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్వీకరించలేదు. ఒకటి అరా ఫిర్యాదులను స్వీకరించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇష్టారాజ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పచ్చమూకలు దాడులకు తెగబడ్డాయి. ఒంగోలు నగరంలో పార్టీకి చెందిన ఒక నాయకుడిని మేకులు కొట్టిన కర్రలతో దాడి చేసి కొట్టడం సంచలనం సృష్టించింది. నగర శివారులోని ఒక సానుభూతిపరుడి కారును ధ్వంసం చేయడమే కాకుండా పోలీసుల సమక్షంలోనే అతడి ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి కుటుంబ సభ్యులపై సైతం కర్రలు, కత్తులతో దాడి చేసి గాయపరిచారు. ఇదే పరిస్థితి జిల్లా అంతటా కనిపించింది. ఈ ఏడాది కాలంగా జిల్లాలో ఇదే తరహాలో దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. మహిళలని కూడా చూడకుండా దాడులు చేస్తున్నారు. అంతటితో ఊరుకోకుండా బాధితులపైనే అక్రమ కేసులు బనాయించి వేధింపులకు పాల్పడుతున్నారు. కూటమి పాలనలో రాష్ట్రం మరో బీహారులా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థిపైనా కేసులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపు చర్యలకు దిగింది. ఎప్పుడో సోషల్ మీడియాలో చంద్రబాబు, లోకేష్‌లకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారని ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ మీద కూడా కేసులు పెట్టింది. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పై ఏకంగా ఏడు పోలీసు స్టేషన్ల పరిధిలో కేసులు పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి మీద కూడా కేసులు పెట్టించింది. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల మీద అడ్డగోలుగా కేసులు పెట్టి వేధిస్తోంది.



అసంపూర్తిగా మిగిలిన డ్రైవింగ్ స్కూలు నిర్మాణం

డ్రైవింగ్ స్కూలు.. మొండిగోడలు

13 నెలల కిందట ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబు నాయుడు దర్శిని అభివృద్ధి చేసి ఎక్కడికో తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభిస్తానన్నారు. ప్రస్తుతం దాని గేటు తీసి ఎలా ఉందో చూసిన దాఖలాలు కూడా లేవు. దొనకొండను పారిశ్రామికవాడ చేస్తానని పాతపాట పాడారు. దొనకొండ వైపు ఒక్క కంపెనీ ప్రతినిధి వచ్చి చూసిన దాఖలాలు కూడా లేవు. మొగలిగుండాల రిజర్వాయరు ముఖమే చూడలేదు. రాగమొక్కపల్లి ఎంఎస్ ఎంఈ కి ఊసే లేదు. గుండ్లకమ్మ నీరు ముండ్లమూరు, తాళ్లూరుకు కు నీరందిస్తానని పట్టించుకోలేదు. ఇలా ఎన్నికల ముందు ప్రజలకు మాయ మాటలు చెప్పి ప్రజలను మరోసారి మోసం చేశాడంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పశ్చిమ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యాన్ని, వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మార్కాపురం మండలం రాయవరం వద్ద రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టారు. 75 శాతం పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నాలు చేయడం దారుణం. ప్రభుత్వమే మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని చేపట్టి, పూర్తి చేసి వైద్య విద్యను, కార్పొరేట్ వైద్య సేవలను అందించాలి. పశ్చిమ ప్రకాశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎక్కువ. జీజీహెచ్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.

– **అందె నాసరయ్య**, మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీ కన్వీనర్, మార్కాపురం

జిల్లా ఏర్పాటు ఎప్పుడో...?



అధికారంలోకి రాగానే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తానని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి ఏడాది దాటుతోంది. ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదు. మార్కాపురం జిల్లాగా ఏర్పాటైతేనే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుంది. ఏడాది కావస్తున్నా ఇంత వరకూ ప్రకటనలే తప్ప ఆచరణలో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం పుల్లలచెరువు, అర్ధవీడు, గిద్దలూరు, కొమరోలు మండలాల ప్రజలు ఒంగోలుకు వెళ్లి పనులు చూసుకుని రావాలంటే ఒకరోజు సమయం పడుతోంది. మార్కాపురం జిల్లా ఏర్పాటైతే ఈ సమస్యలు తీరుతాయి.

– **కేవీ రమణారెడ్డి**, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పొదిలి

మిర్చి క్లస్టరు హామీ ఏమైంది



మార్కాపురంలో మిర్చి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో మిర్చిని అమ్మాలంటే అనేక వ్యయప్రయాసలకోర్చి గుంటూరుకు వెళ్లి అమ్ముకుంటున్నాం. ఈ ఏడాది మిర్చి ధరలు పూర్తిగా పడిపోయాయి. గత ఏడాది నవంబరులో క్వింటా రూ.18 వేలు ఉండగా జనవరి నుంచి అనూహ్యంగా మిర్చి ధర రూ.13 నుంచి రూ.14 వేలకు పడిపోయి ప్రస్తుతం క్వింటా రూ.8 వేలు కూడా పలకడం లేదు. నేను మూడున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. రూ.5 లక్షల పెట్టుబడి ఖర్చులు కాగా మరో రూ.5 లక్షలు అదనపు ఖర్చులు వచ్చాయి. క్వింటా మిర్చి రూ.8 వేలు ధర పలకడంతో వచ్చిన డబ్బులన్నీ కూలీలు, ఇతరత్రా ఖర్చులకే సరిపోయాయి. 2023 లో మిర్చి ధర రూ.22 వేలు పైగా ఉంది.

– **జగన్**, మిర్చి రైతు, ఓబాయపల్లి, తర్లుపాడు మండలం

పశ్చిమ ప్రాంత రైతులను కూటమి ప్రభుత్వం దగా చేసింది



పశ్చిమ ప్రాంత రైతాంగాన్ని చంద్రబాబునాయుడు ప్రభుత్వం దగా చేసింది. ఈ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో కేవలం రూ.116 కోట్లు కేటాయించటం ప్రాజెక్టు పట్ల ఆయనకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. ప్రాజెక్టును పరిశీలించేందుకు వచ్చిన ముగ్గురు మంత్రులతో ఒరిగిందేమీ లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుపై దృష్టి సారించాలి.

– **పూర్ణకంటి తిరుమలయ్య**, సీపీఐ నాయకుడు, పెద్దదోర్నాల

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి జి.రాజరాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఈమేరకు ఉత్తర్వులు జారీచేసిందన్నారు.

4వ తరగతిలో ప్రవేశాలకు అర్హతలు:

- 2015 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2017 మార్చి 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. 1 నుంచి 4వ తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో అకడమిక్ సంవత్సరం తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉంటేనే 5వ తరగతి ప్రవేశానికి అనుమతి. పుట్టిన తేదీ ధ్రువపత్రం ఉండాలి.

5వ తరగతిలో ప్రవేశాలకు అర్హతలు:

- 2014 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2016 మార్చి 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. 1 నుంచి 4వ తరగతి వరకు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో అకడమిక్ సంవత్సరం తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉంటేనే 4వ తరగతి ప్రవేశానికి అనుమతి. పుట్టిన తేదీ ధ్రువపత్రం ఉండాలి.

పైన పేర్కొన్న అర్హతలున్న చిన్నారులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్://ఏపీస్పోర్ట్స్‌స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్/ ద్వారా ఈనెల 19వ తేదీలోగా నమోదు చేసుకోవాలి. ఈనెల 20 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్‌లిస్టు జారీ చేస్తారు. జూలై 1 నుంచి 3వ తేదీ వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఎంపికకు ఒరిజినల్ పత్రాలతో హాజరుకావాలి. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నిర్వహించే ఎంపికకు హాజరుకావాలి. ఈ అవకాశాన్ని జిల్లాలోని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి జి.రాజరాజేశ్వరి తెలిపారు.

హరిత శోభితంగా ఉండాలి

ఒంగోలు సబర్బన్: హరిత శోభిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. సంబంధిత శాఖలు సమన్వయంతో వివిధ వర్గాలను ఇందులో భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఈ నెల 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ×వనం మన్యం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈ కార్యక్రమం అమలుపై మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎఫ్ఓ (సోషల్ ఫారెస్ట్) రాజశేఖర్ మాట్లాడుతూ 5 వ తేదీన ప్రకాశం జిల్లాలో 4 లక్షల 10 వేల మొక్కలు నాటడం లక్ష్యమన్నారు. జూన్ నుంచి నవంబర్ వరకు 6 నెలల వ్యవధిలో జిల్లాలో 35 లక్షల 76 వేలకు పైగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 36 శాతం అటవీ విస్తీర్ణం ఉందని, దీనిని 50 శాతానికి పెంచేలా అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలు, కాలేజీలు, విద్యా సంస్థల్లో విస్తృత స్థాయిలో వీటిని నాటేలా చూడాలన్నారు. సంబంధిత శాఖలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు నాటేలా మొక్కలను సరఫరా చేయాలని హార్టీకల్చర్, అటవీ శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి గోపి చంద్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాఘవరెడ్డి, డ్వామా ఏపీడీ వండర్ మాన్, హౌసింగ్ బోర్డు ఎస్ఈ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం శ్రీనివాసరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి అంజల, డీపీఓ గొట్టిపాటి వెంకట నాయుడు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, జిల్లా ఉప విద్యాధికారి చంద్ర మౌళి, జిల్లా పరిషత్, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఆత్మరక్షణకు కరాటే ఉపయోగకరం

- ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు



సర్టిఫికెట్లను అందిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు

ఒంగోలు: ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగకరమని ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు అన్నారు. స్థానిక హైదరీ క్లబ్ ఆవరణలో మంగళవారం కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గుండవరపు రాఘవ, ఉపాధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డెంపూడి సుజాతారావు, ప్రకాశం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావు తదితరులు బెల్టులు అందించారు. కార్యక్రమంలో కోచ్ నల్లూరి మోహనరావు, సిద్ధార్థ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, అట్లూరి శ్రీధర్, వల్లపు వెంకటేశ్వర్లు, పీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

- డీటీసీ సుశీల



ప్రమాదం జరిగిన సంఘటనను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

కొమరోలు: రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని డీటీసీ సుశీల తెలిపారు. మండలంలోని తాటిచెర్లమోటులో 10 రోజులక్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా మంగళవారం డీటీసీ సుశీల, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ పార్వతీశం, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డీటీసీ సుశీల సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి ప్రమాదం ఏ విధంగా జరిగిందో వివరించారు. ఈ సందర్భంగా డీటీసీ సుశీల మాట్లాడుతూ వాహనాలు వేగంగా నడుపడం వల్లే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వాహనదారులు అతివేగంతో వాహనాలు నడపకుండా జాగ్రత్తగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

తర్లుపాడు: రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తర్లుపాడు మండల పరిధిలోని కేతగుడిపి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. మార్కాపురం రైల్వే హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణారెడ్డి కథనం ప్రకారం.. మార్కాపురం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముండే చిలకా నాగయ్య(60) తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మంగళవారం ఉదయం రైల్వే పోలీసులు కేతగుడిపి సమీపంలో ఓ వ్యక్తి రైలు పట్టాలపై మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. స్థానికంగా సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టడంతో మృతుడిని కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పిండవుతున్న మురుగమ్మి కొండ!

- అటవీశాఖతోపాటు బంజరు భూముల్లో అడ్డగోలుగా వైట్ క్వార్ట్జ్ మైనింగ్
- కొండ ప్రాంతంలో మూడు జేసీబీలతో భారీ కందకాలు
- మురుగమ్మి గ్రామ టీడీపీ నాయకుడే సూత్రధారి
- వైట్ క్వార్ట్జ్ ముడి ఖనిజాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారుల మౌనం
- గ్రామస్తుల వరుస ఫిర్యాదులతో ఆలస్యంగా తనిఖీ



అటవీ భూముల్లో తెల్లరాయి కోసం తవ్విన భారీ గుంతలు
ఇన్‌సెట్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన తెల్లరాయి

పీసీపల్లి: వ్యక్తిగత 'సంపద సృష్టి' కోసం ఓ టీడీపీ నాయకుడు బరితెగించాడు. మురుగమ్మి సమీపంలోని పచ్చటి కొండ ప్రాంతంలో విరివిగా లభ్యమవుతున్న వైట్ క్వార్ట్జ్ ముడి ఖనిజాన్ని అడ్డగోలుగా తవ్వేస్తున్నాడు. మూడు జేసీబీలతో కొండ ప్రాంతంలో తీసిన భారీ కందకాలు చూసి విస్తుపోవడం గ్రామస్తుల వంతయింది. టీడీపీ నేత సాగిస్తున్న ధ్వంసరచనపై మైనింగ్, రెవెన్యూ తదితర శాఖల అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా స్పందించడం విమర్శలకు తావిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పీసీపల్లి మండలంలోని మురుగమ్మి గ్రామ పరిధిలో అటవీ, బంజర, పోరంబోకు భూముల్లో వైట్ క్వార్ట్జ్ నిక్షేపాలు విస్తరించి ఉన్నాయి. వైట్ క్వార్ట్జ్‌ను విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం రచించిన మురుగమ్మి గ్రామ టీడీపీ నాయకుడు తెలంగాణకు చెందిన వ్యక్తులతో కలిసి అక్రమ మైనింగ్‌కు తెరలేపాడు. రాత్రీ పగలు అనే తేడా లేకుండా మూడు జేసీబీలతో కొండ ప్రాంతాన్ని తొలిచేస్తున్నాడు. సుమారు 20 అడుగుల లోతున.. దాదాపు 70 చోట్ల తవ్విన భారీ గోతులు అటవీ భూముల రూపురేఖలనే మార్చేశాయి.

రూ.లక్షల్లో అక్రమార్జన

వైట్ క్వార్ట్జ్‌ను గాజు తయారీ పరిశ్రమలు, మెటల్ కాస్టింగ్, రబ్బర్, పెయింట్, సెరామిక్, పెట్రోలియం తదితర పరిశ్రమల్లో అవసరాలకు అధికంగా వినియోగిస్తారు. రాయి నాణ్యతను బట్టి పరిశ్రమలు ధర చెల్లిస్తాయి. పీసీపల్లి మండలంలో మురుగమ్మితోపాటు మరికొన్ని గ్రామాల్లో లభ్యమయ్యే వైట్ క్వార్ట్జ్‌కు మంచి ధర పలుకుతుండటంతో టీడీపీ నాయకుడు అక్రమ తవ్వకాలకు పూనుకున్నాడు. రూ.లక్షల విలువ చేసే రాయిని తెలంగాణకు చెందిన కొందరు పెట్టుబడిదారులతో కలిసి తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ అక్రమ బాగోతంపై కొందరు గ్రామస్తులు మైనింగ్, అటవీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.



సీజ్ చేసిన వాహనాలతో మైనింగ్ అధికారులు

ఎట్టకేలకు కదిలిన మైనింగ్ శాఖ

మురుగమ్మిలో వైట్ క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌పై గ్రామస్తులు వివిధ శాఖల అధికారులకు ఫిర్యాదు చేయగా ఎట్టకేలకు మైనింగ్ శాఖ అధికారులు స్పందించారు. మైనింగ్ శాఖ ఏజీ పోలిరెడ్డి, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్రమంగా మైనింగ్ చేస్తున్నది వాస్తవమేనని నిర్ధారించారు. మైనింగ్ శాఖ అధికారులు వచ్చారని తెలుసుకున్న స్మగ్లర్లు, డ్రైవర్లు తమ వాహనాలను అక్కడే వదిలేసి పరారయ్యారు. దీంతో వాహనాలతోపాటు తరలించేందుకు సిద్ధం చేసిన రాయిని సీజ్ చేశారు. వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తున్నట్లు మైనింగ్ ఏజీ చెప్పారు.

అధికారులు ఏమీ చేయలేరట!

వైట్ క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌పై గ్రామస్తులు ఫిర్యాదు చేసిన విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు మరింతగా రెచ్చిపోయాడు. 'అధికారులకు ముట్టజెప్పాల్సింది ముట్టజెప్పాం. అధికారంలో ఉంది మేమే. ఎవరూ ఏమీ చేయలేరు' అంటూ టీడీపీ నేత బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. మురుగమ్మి కొండ ప్రాంతంలో వైట్ క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై మార్కాపురం మైనింగ్ ఏడీని వివరణ కోరగా.. 'మాకు సంబంధం లేదు. ఫారెస్ట్ అధికారులదే బాధ్యత' అని చెప్పారు.

బడుగులపైనా పోలీసుల దౌర్జన్యం..?

- ప్రజల హక్కులు హరిస్తున్న కూటమి ప్రభుత్వం
- జాళ్లపాలెం ఘటనను వక్రీకరిస్తున్న మంత్రి స్వామి, ఎస్పీ దామోదర్
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: రాష్ట్రంలో తెనాలి ఘటన మరవకముందే కొండపి మండలం జాళ్లపాలెంలో మహిళలపై ఎస్సై దౌర్జన్యం చూస్తుంటే కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులను హరిస్తుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాళ్లపాలెం ఘటనలో ఎస్సై రమేష్‌బాబు సీసీ ఫుటేజీ కోసం దుకాణంలోని మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, ఇంట్లోకి బలవంతంగా వెళ్లి హార్డ్‌డిస్క్, సెల్‌ఫోన్, పెన్‌డ్రైవ్‌లు బలవంతంగా తీసుకెళ్లారన్నారు. బాధిత మహిళలకు న్యాయం చేయాల్సింది పోయి వీరిపైనే కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు ఈ విధంగా చట్టాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాయడం హేయమైనచర్యగా అభివర్ణించారు. ఈ ఘటనలో ఎటువంటి రాజకీయానికి తావు లేదని, కానీ మంత్రి స్వామి మాత్రం ఈ ఘటనను రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. పట్టపగలు ఎస్సై రమేష్‌బాబు మహిళలపై దౌర్జన్యం చేస్తే మంత్రి స్వామి కులం పేరుతో వైఎస్సార్ సీపీపై అభాండాలు వేస్తున్నారన్నారు.

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై 766 హత్యాయత్నాలు, హత్యలు జరిగాయని, 390 మంది నాయకులు, కార్యకర్తలు హత్యకు గురయ్యారన్నారు. సుమారు 2,466 మందిపై అక్రమ కేసులు బనాయించారని, 500 మందిని జైలుకు పంపారని ఆరోపించారు. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించినందుకు సోషల్‌మీడియా యాక్టివిస్టులపై 440 కేసులు బనాయించి 79 మందిని జైలుకు పంపారన్నారు. జాళ్లపాలెం ఘటనలో రౌడీషీటర్ ఉన్నాడని, మహిళ ఎస్సైపై దాడి చేసిందని మంత్రి స్వామి ఆరోపిస్తున్నాడని, మంత్రి అనే వ్యక్తి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని హితవు పలికారు. షాపు యజమాని కొండలరావుకు వాటర్‌ప్లాంట్ ఉంటే టీడీపీ శ్రేణులు జేసీబీ తీసుకువచ్చి ధ్వంసం చేసి సామానులు వాగులో పడేశారని, దీనిపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. జగ్గరాజుపాలెం పెట్రోల్‌బంకు వద్ద దాడి జరిగిందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. జాళ్లపాలెం ఘటనలో బాధితులతో జగనన్న మాట్లాడతాడనే సరికి హడావుడిగా బాధితులపైనే కేసులు నమోదు చేశారన్నారు. ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్ న్యాయం చేయాలని కోరారు. కొండపి మండలం పెట్లూరులో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కల్లూరి చంద్రమౌళికి చెందిన 3.5 ఎకరాల బొప్పాయి తోటను ధ్వంసం చేశారని, రూ.20 లక్షల విలువైన పంటను ధ్వంసం చేసినా ఎటువంటి చర్యలు లేవన్నారు. కేసుల విషయంలో హోంమంత్రి కులం ప్రస్తావన వద్దంటే, మంత్రి స్వామి మాత్రం కుల ప్రస్తావన తీసుకువస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో బలహీన వర్గాల వారిపై ఎన్నో దాడులు జరిగాయని, కానీ చర్యలు లేవని మండిపడ్డారు.

వెన్నుపోటు దినం జయప్రదం చేయండి

ఏడాది పాలనలో ఒక్క హామీని అమలు చేయని కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం ఉదయం 10 గంటలకు కొండపిలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గాదంశెటి గుప్తా, సోమిశెట్టి సురేష్, షేక్ కరీం, కోమట్ల వెంకారెడ్డి, మిడసల అశోక్, పి శ్రీనివాసులరెడ్డి, షేక్ అబ్దుల్లా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి



మృతి చెందిన గుణపాటి తిరుపతిరెడ్డి

చీమకుర్తి రూరల్:

రోడ్డు పక్కన నిల్చున్న వృద్ధుడిని వేగంగా వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రగాయాలతో మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన చీమకుర్తి మండలంలోని రెడ్డినగర్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రెడ్డి నగర్‌కు చెందిన గుణపాటి తిరుపతిరెడ్డి(60) సోమవారం రాత్రి 10 గంటల సమయంలో రోడ్డు పక్కన నిల్చుని ఉన్నాడు. అదే సమయంలో ఒంగోలు నుంచి చీమకుర్తి వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తిరుపతిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు హుటాహుటిన ఒంగోలు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మంగళవారం జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కారుతోపాటు ఓనర్‌ను అదుపులోకి తీసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చీమకుర్తి సీఐ సుబ్బారావు తెలిపారు.

పోలీస్ క్రికెట్ టోర్నీ విజేత జిల్లా హెడ్ క్వార్టర్స్ జట్టు



విజేతగా నిలిచిన జట్టుతో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు శాఖ నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో జిల్లా హెడ్ క్వార్టర్స్ జట్టు విజేతగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన జిల్లా సబ్ డివిజన్ పోలీసు అధికారుల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన జిల్లా హెడ్ క్వార్టర్స్ జట్టు 9 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మరో మ్యాచ్‌లో జిల్లా సబ్ డివిజన్ పోలీస్ జట్టు నిర్ణీత 9.5 ఓవర్లలో 53 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా హెడ్ క్వార్టర్ జట్టు 6.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. విజేతగా నిలిచిన జట్టును ఎస్పీ అభినందించారు. నిత్యం విధులు, బందోబస్తులతో సతమతమవుతున్న పోలీసు అధికారులు, సిబ్బందికి మానసికోల్లాసం కలిగించడానికి క్రీడా పోటీ నిర్వహించినట్లు చెప్పారు. ఏఆర్ ఎస్పీ అశోక్ బాబు, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీ నారాయణ, నాగరాజు, సాయిఈశ్వర్ యశ్వంత్, శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన పూరిల్లు

- రూ.2 లక్షల ఆస్తి నష్టం

యర్రగొండపాలెం: స్థానిక గాయత్రి థియేటర్‌కు సమీపంలో ఉన్న పూరిగుడిసె మంగళవారం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఈ సంఘటనలో దాదాపు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాలు.. బేల్దారి పనులు పనిచేసుకునే పోలేపల్లి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఆరుబయట కూర్చుని టిఫిన్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా గుడిసెకు మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమై మంటలు ఆర్పేలోగా గుడిసెతోపాటు ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయింది. బ్యాంకులో పొదుపు గ్రూపు ఖాతా నుంచి డ్రా చేసుకుని వచ్చిన రూ.80 వేల నగదు, టీవీ, బీరువా, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలు అదుపు చేశారు. తక్షణ సహాయం కింద చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు రూ.8,500 నగదును బాధిత కుటుంబానికి అందజేశారు.

బ్రహ్మోత్సవాల్లోనూ రాజకీయం!

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల్లో రాజకీయాలు చేస్తున్నారని ఉభయదాతలు ఆరోపిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామి వారి కల్యాణోత్సవానికి గత 22 సంవత్సరాలుగా ఉభయదాతలుగా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ దంపతులు వ్యవహరిస్తూ వస్తున్నారు. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో ఉభయదాతల పేర్లు కరపత్రికలో ప్రకటించడం ఆనవాయితీ. అందరు ఉభయదాతలతోపాటే యన్నబత్తిన చిన్నా దంపతుల పేర్లు కూడా కరపత్రికలో ప్రచురించేవారు. కానీ ఈసారి అందుకు విరుద్ధంగా కరపత్రికలో చిన్నా పేరు ప్రకటించకుండా దేవస్థానం వారి సౌజన్యంతో అని ప్రచురించారు. దీనిపై ఉభయకర్తలు దేవుడి ఉత్సవాల్లో రాజకీయాలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది కరపత్రికలో చిన్నా పేరు ఉన్నప్పటికీ కూటమి పార్టీల నాయకులు కల్యాణోత్సవం పీటల మీద కూర్చోనిచ్చేది లేదంటూ పరోక్షంగా బెదిరింపులకు దిగారు. దీంతో చిన్నా కోర్టును ఆశ్రయించడంతో కల్యాణోత్సవానికి ముందే ఉభయకర్తగా చెల్లించాల్సిన మొత్తాన్ని జమ చేసి పాల్గొనవచ్చని తీర్పు ఇచ్చింది. కానీ ఈసారి కరపత్రికలో అతని పేరు లేకుండా చేశారు.

దీనిపై ఆలయ ఈఓ పి.కృష్ణవేణిని వివరణ కోరగా.. ఏటా కల్యాణోత్సవంలో ఒక్కరికే అవకాశం దక్కేదని, ఈసారి ఎక్కువ మంది పాల్గొనేలా చూసేందుకు రూ.15 వేలు కట్టిన దంపతులకు అవకాశం ఇచ్చామని చెప్పుకొచ్చారు.

ఏఆర్ ఎస్పీగా అశోక్‌బాబు



ఎస్పీ దామోదర్‌కు పూలమొక్క అందజేస్తున్న ఏఆర్ ఎస్పీ అశోక్‌బాబు

ఒంగోలు టౌన్: అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ అంచెలంచెలుగా ఎదిగి ఏఆర్ ఎస్పీగా పదోన్నతి పొందిన అశోక్‌బాబు నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారని ఎస్పీ ఏఆర్ దామోదర్ కొనియాడారు. పోలీసు శాఖలో ఏఆర్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందిన అశోక్‌బాబు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. అశోక్‌బాబు షోల్డర్‌కు స్టార్ అలంకరించిన ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

బంగారు ఉంగరం కోసమే హత్య

లింగసముద్రం:

బంగారు ఉంగరం కోసమే వృద్ధుడిని హత్య చేశారని పోలీసులు తెలిపారు. ఐదు రోజుల క్రితం తోపూరి నరసింహాన్ని దారుణంగా హత్య చేసిన చలంచర్ల బ్రహ్మయ్యను అరెస్టు చేసి కందుకూరు కోర్టులో హాజరుపరిచినట్లు గుడ్లూరు సీఐ మంగారావు చెప్పారు. నరసింహాన్ని బంగారపు ఉంగరం కోసమే బ్రహ్మయ్య హత్య చేసినట్లు విచారణలో తేలినట్లు సీఐ మంగారావు చెప్పారు. హత్యకు సంబంధించిన వివరాలను సీఐ మంగళవారం వెల్లడించారు. పొన్నలూరు మండలం రావులకొల్లు గ్రామానికి చెలంచర్ల బ్రహ్మయ్య కుటుంబ సభ్యులతో పదేళ్ల నుంచి పెంట్రాల ఎస్టీ కాలనీలో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. గత నెల 30వ తేదీన నరసింహం నిమ్మతోటకు కంచె వేసేందుకు బ్రహ్మయ్యను తీసుకుని వెళ్లాడు. పని చేస్తుండగా నరసింహం చేతికి ఉన్న పచ్చరాయి బంగారపు ఉంగరాన్ని చూసి దానిని ఎలాగైనా దక్కించుకోవాలని నరసింహంను మొద్దుకత్తితో నరకడంతో నరసింహం అక్కడికక్కడే మృతి చెందాడు. అనతంరం ఉంగరాన్ని తీసుకుని కందుకూరులో విక్రయించాడు. రాత్రికి నిమ్మతోటలో ఉన్న నరసింహం మృతదేహం వద్దకు వెళ్లి నిమ్మతోట పక్క పొలంలో ఉన్న బోరు బావి వద్దకు నరసింహం మృతదేహాన్ని లాక్కెళ్లి మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి బోరుబావిలో పడేశాడు. బ్రహ్మయ్యను విచారించగా తాను బంగారు ఉంగరం కోసమే నరసింహంను హత్య చేసినట్లు అంగీకరించాడని సీఐ చెప్పారు. బ్రహ్మయ్యను అరెస్టు చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

మద్దిపూడి ఎస్సైపై ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

సింగరాయకొండ: ప్రకాశం జిల్లా మద్దిపూడి ఎస్సై ఎ.రమేష్ బాబుపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్ఎహెచ్ఆర్సీ)కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మారంరెడ్డి కొండలరావు తెలిపారు. కొండపి మండలం జాళ్లపాలెంలోని తన ఇంట్లోకి మే 28వ తేదీన మద్రిపూడి ఎస్సై దౌర్జన్యంగా ప్రవేశించడమే కాకుండా, తన రక్త సంబంధీకులైన మహిళలు, యువకులపై దాడికి పాల్పడి, అసభ్య పదజాలంతో దూషించారని, తన ఇంట్లో సీసీ టీవీ డివైజ్ పరికరాలు, సెల్‌ఫోన్లు, పెన్ డ్రైవ్‌లు లూటీ చేశారని, ఈ ఘటనపై విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్‌ఆర్సీని కోరినట్లు పేర్కొన్నారు. మానవ హక్కుల కమిషన్ వద్ద తన ఫిర్యాదు నమోదైందని కొండలరావు చెప్పారు.